ఆంధ్రజ్యోతి





- వివిధ పద్దుల కింద కేటాయిస్తూ ప్రకటన
- నీటి పారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యం
- మెగాటెక్స్‌టైల్ పార్క్‌కు మొండి చేయి
- ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు శూన్యం
- ఊసులేని కొత్త సెంట్రల్ జైలు నిర్మాణం, కాళోజీ కళాక్షేత్రం
- స్మార్ట్‌సిటీ పనులకు మ్యాచింగ్ గ్రాంట్
- ఎకో టూరిజంగా పాకాల, ఏటూరునాగారం
- మేడారం జాతర పనులకు నిధులు

కొంత మోదం.. కొంత ఖేదం..

రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు రూ.2595.53 కోట్లు

హనుమకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024-25 వార్షిక బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చేసిన కేటాయింపులు చూస్తే కొంత మోదం.. కొంత ఖేదం అన్నట్టుగా ఉందని జిల్లావాసులు అభిప్రాయ పడుతున్నారు. సాగునీటి ప్రాజెక్టులకు, ముఖ్యంగా ఎత్తిపోతల పథకాలకు ఎక్కువ నిధులను కేటాయించిన ప్రభుత్వం.. ఎంతో కీలకమైన మెగాటెక్స్‌టైల్‌పార్క్, కాళోజీ కళాక్షేత్రం, ఆసుపత్రుల అభివృద్ధి, సెంట్రల్‌జైల్ నిర్మాణం, వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం లాంటి వాటిని పట్టించుకోలేదన్న చర్చ జరుగు తోంది. నీటిపారుదలతో పాటు వివిధ పద్దుల కింద ఉమ్మడి జిల్లాకు మొత్తంగా రూ.2595.53 కోట్లను నిర్దేశించారు. గత ఆర్థిక సంవత్సరం 2023-24 కన్నా సుమారు రూ.350కోట్లు ఎక్కువని తెలుస్తోంది. ఎత్తిపోతల పథకాలైన కాళేశ్వరం, దేవాదుల, ఎస్ఆర్ ఎస్‌లకు రూ. 2376.55కోట్లు, ఇతరత్రా పద్దుల కింద రూ.218.97 కోట్లను కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం నాణ్యత విషయంలో వివాదం నడుస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులు, నిర్వహణ, ఇతరత్రా ఖర్చులకు గాను రూ.1676.46 కోట్లను కేటా యించగా.. గత బడ్జెట్ కన్నా ఈ సారి రూ.50కోట్లు ఎక్కువగానే ఇచ్చారు. దీంతో పాటు కాకతీయ విశ్వవిద్యాలయం, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ, వరంగల్ మహానగర పాలక సంస్థ, వరంగల్ స్మార్ట్ సిటీ, మేడారం తదితర వాటికి బడ్జెట్‌లో నిధులను ఇస్తున్నట్టు ప్రస్తావించారు. అయితే బడ్జెట్‌లో గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మెగాటెక్స్‌టైల్ పార్క్, వరంగల్ సెంట్రల్ జైల్ నిర్మాణం ఊసేలేదు.

సీఎం పరిశీలించి వెళ్లినా..

ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనలో భాగంగా ఈ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను సందర్శించి.. పార్క్ సత్వర పూర్తికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాత సెంట్రల్ జైలు స్థానంలో నిర్మిస్తున్న మల్టీసూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి నిధుల అంశం కూడా బడ్జెట్‌లో కానరాలేదు. సీఎం రేవంత్ నగర పర్యటనలో భాగంగా దీనిని కూడా సందర్శించారు. అయితే దీని నిర్మాణ అంచనా వ్యయాన్ని అడ్డగోలుగా పెంచడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలోనే ఈ ఆస్పత్రికి నిధులను కేటాయించి ఉండకపోవచ్చునన్న చర్చ జరుగుతోంది. కేఎంసీలో ఆవరణలో ఇటీవల నిర్మించిన సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి కూడా నిధుల ఊసేలేదు. నత్తనడకన నిర్మాణం జరుగుతున్న కాళోజీ కళాక్షేత్రం గురించి అసలు పట్టించుకోలేదు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించిన ప్రభుత్వం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా)ను కూడా పట్టించుకుంటే బాగుం డేదన్న అభి ప్రాయం వ్యక్తమవు తోంది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని స్మార్ట్ సిటీ పథకానికి బడ్జెట్‌లో మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చిన ప్రభుత్వం అసంపూర్తిగా మిగిలిపోయిన స్మార్ట్ సిటీ పనుల పూర్తికి రూ 156.22 కోట్లను ఇచ్చింది. మిగిలిపోయిన జాతర పనుల కోసం రూ.52.95 కోట్లను నిర్దేశించింది. ఉమ్మడి జిల్లాలో పర్యాటానికి ఈ సారి పెద్ద నిధులను విదల్చలేదు. నగరంలోని ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన నియో మెట్రోరైల్ ప్రాజెక్టు అంశం బడ్జెట్‌లో పేర్కొన్నప్పటికీ నిధులపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. లెదర్ పార్క్ అంశాన్ని పట్టించుకోలేదు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు గురించి బడ్జెట్‌లో ఎక్కడా పేర్కొన లేదు.

మహబూబాబాద్‌లో మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం, జనగామ కల్లెంలో టెక్స్‌టైల పార్క్, కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్, ములుగు జిల్లాలో బిల్ట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ, రామప్ప గుడి అభివృద్ధి, భూపాలపల్లిలో మైనింగ్ విద్యాలయం తదితర అంశాలకు బడ్జెట్‌లో చోటు దక్కలేదు.



3.70 లక్షల మంది రైతులకు భరోసా

రైతు భరోసా అమలుపై శాసన సభలో మరోసారి ప్రభుత్వం ప్రకటన చేసింది. బడ్జెట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతులకు ఏటా ఎకరానికి రూ. 15000 చెల్లిం చాలన్నది తమ సంకల్పమని, దీనిపై శాసనసభలో చర్చించి విధి విధానాలను ఖరారు చేసిన తర్వాత అమలు చేస్తామని స్పష్టం చేసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తుండగా ఉమ్మడి జిల్లాలో సుమారు 3.70లక్షల మంది రైతు భరోసా అందుకోనున్నారు. అలాగే బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు కేటాయించడం పట్ల అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.



వ్యవసాయ కూలీలకూ ఆర్థిక సాయం

భూమిలేని నిరుపేద రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు అందించే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ప్రకటించగా ఉమ్మడి జిల్లాలో సుమారు 3.20లక్షల మంది రైతు కూలీలకు ప్రయోజనం చేకూరనుంది.

ఎకో టూరిజంగా పాకాల, ఏటూరునాగారం



ఎకో టూరిజాన్ని ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా పాకాల, ఏటూరునాగారంలను టూరిజం సర్క్యూట్లుగా గుర్తించినట్టు బడ్జెట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో గుర్తించిన ఏడు అటవీ ప్రాంతాల్లో ఈ రెండు ఉన్నాయి. పాకాల, ఏటూరునాగారం అటవీ ప్రాంతాలను ఎకో టూరిజంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను కేటాయించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఈ రెండు ప్రాంతాలు పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి.

నిధుల కేటాయింపు ఇలా.. (అంచనా)

కాళేశ్వరం ప్రాజెక్టు :	రూ.1676.46 కోట్లు
ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 1:	రూ.140.00 కోట్లు
దేవాదుల (జీఎల్ఎస్):	రూ.20.04 కోట్లు
కంతనపల్లి (జీఎఎల్ఎస్):	రూ.20.00 కోట్లు
చిన్న కాళేశ్వరం:	రూ.200.00 కోట్లు
కంతనపల్లి ప్రాజెక్టు (నిర్వహణ):	రూ.30,05 కోట్లు
దేవాదుల (ఏఐబీపీ) ప్రాజెక్టు:	రూ.43.50 కోట్లు
ఎస్ఆర్ఎస్‌పి స్టేజ్ 2 (ఏఐబీపీ) :	రూ.25.00 కోట్లు
దేవాదుల (ఏఐబీపీ) :	రూ.14.50 కోట్లు
ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2 (ఏఐబీపీ) :	రూ.9.00 కోట్లు
పాకాల సరస్సు (జీఎల్ఐఎస్):	రూ.5.00 కోట్లు
రామప్ప సరస్సు (జీఎల్ఐఎస్) :	రూ.5.00 కోట్లు
మల్లూరు వాగు (ఎస్ఆర్ఎస్‌పీ-1):	రూ.1.00 కోట్లు
వట్టివాగు (ఎస్ఆర్ఎస్‌పి -1):	రూ.25.90 కోట్లు
లక్నవరం (జీఎల్ఐఎస్):	రూ 2.00 కోట్లు
ఘనపూర్ సిస్టం (ఫతేపూర్-పాపన్నపేట కాలువ):	రూ.57.00 కోట్లు
ఎల్‌టీ బయ్యారం:	రూ.1.00 కోట్లు
వరంగల్, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్స్:	రూ.16.53 కోట్లు
కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ:	రూ.2,00 కోట్లు
వరంగల్ కార్పొరేషన్:	రూ.50.00 కోట్లు
వరంగల్ స్మార్ట్ సిటీ (మ్యాచింగ్ గ్రాంట్):	రూ.14.34 కోట్లు
వరంగల్ స్మార్ట్ సిటీ పనులు:	రూ.15.60 కోట్లు
మేడారం జాతర పనులు:	రూ.52.95 కోట్లు
వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో భవనాలు:	రూ.10.00 కోట్లు

ప్రతిష్ఠాత్మకంగా ఆరు గ్యారంటీల అమలు




రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరుగ్యారంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు బడ్జెట్‌లో అధిక మొత్తంలో నిధులను కేటాయించారు. ఈ పథకాలతో ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 6.47లక్షల మంది ప్రయోజనం పొందుతున్నారు. ఇక ప్రతీ నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని ప్రకటించిన క్రమంలో ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలకు గాను 43వేల పైచిలుకు ఇళ్ల నిర్మాణం జరుగనున్నది. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.6లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నారు.

12 చిన్న తరహా పారిశ్రామిక పార్కులకు అవకాశం



మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ప్రత్యేక చిన్నతరహా పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో ఈ తరహా పార్కులు 12 వరకు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. వీటి వల్ల గ్రామీణ సంఘాలకు, మహిళా సమాఖ్యలకు లబ్ధి చేకూరనుంది.

కేయూకు మహర్దశ



విశ్వవిద్యాలయాలకు త్వరలోనే పూర్తికాలపు వైస్‌చాన్సలర్‌ను నియమి స్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయా ల కల్పనకు రూ.500కోట్ల నిధులను బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇందులో రూ.100 కోట్లు ఉస్మానియా విశ్వవిద్యాలయానికి, మరో రూ.100 కోట్లు మహిళా విశ్వవిద్యాలయానికి కేటాయించారు. మిగతా నిధులు కాకతీయ విశ్వవిద్యాలయానికి, ఇతర విశ్వవిద్యాలయాలకు ఖర్చు చేస్తారు. ఈ లెక్కన మిగిలిన నిధుల్లో సింహభాగం అంటే సుమారు రూ.50కోట్ల నుంచి రూ.75కోట్ల వరకు కాకతీయ వర్సిటీకి వచ్చే అవకాశమున్నట్టు అంచనా వేస్తున్నారు.

నేడు మేడిగడ్డకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం

మహదేవపూర్ రూరల్/మహదేవపూర్ జూలై 25 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధామనైన మేడిగడ్డ బ్యారేజీని నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్‌రావు సహా మరో 23మంది ఎమ్మెల్యేలు శుక్రవారం సందర్శించనున్నారు. బ్యారేజీ బ్లాక్-7లో పిల్లర్లు కుంగిన నేపథ్యంలో తాత్కాలిక మరమ్మత్తులు పూర్తికాగా ప్రస్తుతం బ్యారేజీ వద్ద 7లక్షల పైచిలుకు ఇన్‌ఫ్లో వస్తుంది. అయితే అంత వరదను సైతం తట్టుకుని పిల్లర్లు నిలబడితే బ్యారేజీ పనికిరాదంటూ, యావత్ కాళేశ్వరం ప్రాజెక్టు వృథా అంటూ కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు తిప్పికొట్టేందుకే ఎమ్మెల్యేల బృందం బ్యారేజీని సందర్శించనున్నట్లు మండల బీఆర్ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా బ్యారేజీలో నీటినిల్వ చేస్తేనే బ్యారేజీ సామర్థ్యం బయటపడే అవకాశం ఉందని.. అప్పుడుగాని పిల్లర్ల పరిస్థితి ఎంటనేది స్పష్టమవుతుందని పలువురు కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. నీటిని నిల్వచేయకముందే దాని సామర్థ్యం ఎలా తెలుస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు.

మావోయిస్టు నేతల తలలపై రివార్డులు

రూ. 20 లక్షల నుంచి రూ. లక్ష ప్రకటించిన పోలీసులు

ములుగు జిల్లా ఏజెన్సీలో పోస్టర్ల విడుదల



పోలీసులు విడుదల చేసిన వాల్ పోస్టర్

ఏటూరునాగారం, జూలై 25 : ఏజెన్సీ గ్రామీణ అటవీ ప్రాంతంలో ప్రజలు అజ్ఞాత మావోయిస్టులకు ఎవరూ సహకరించవద్దంటూ మావోయిస్టుల వివరాలతో వాల్ పోస్టర్లను ములుగు జిల్లా పోలీసులు విడుదల చేశారు. ఈ మేరకు ఏటూరునాగారం మండలం రామన్నగూడెం, రాంనగర్, లంబాడి తండా గ్రామాలలో గురువారం మావోయిస్టుల వాల్ పోసర్లు , కరపత్రాలను గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో అంటించారు. గ్రామస్తులకు ఎస్సై ఎస్‌కె. తాజుద్దీన్ కరపత్రాలను పంపిణీ చేశారు. కాగా పోలీసులు రివార్డులు ప్రకటించిన వారిలో మావోయిస్టు నేతలు కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్, కుర్సం మంగు అలియాస్ భద్రు, ఎగొల్లపు మల్లయ్య అలియాస్ కోటి, ముచాకి ఉంగాల్ అలియాస్ సుధాకర్, కుంజం ఇడమాల్ అలియాస్ మహేందర్, ముసాకి జమున, ముసాకి దేవాల్ అలియాస్ కురుణాకర్ మడకం ఇడుమయ్య అలియాస్ మహేష్, కారం బుద్రి అలియాస్ ఉన్నారు. సమాచారం మాకు బహుమానం మీకు అనే నినాదంతో గోడ పత్రికలను ముద్రించి గోడలకు అతికించారు. కాగా వారి తలలపై రూ. 20 లక్ష నుంచి రూ. 1 లక్షల వరకు రివార్డులు ప్రకటించారు. వాల్ పోస్టర్లు ఉన్న వారి సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అజ్ఞాతంలో ఉన్నటువంటి మావోయిస్టులు పోరాటం చేయాల్సింది అటవీలో కాదని ప్రజల అందరి మధ్యలో ప్రజా జీవనంలోకి వచ్చి ప్రజల సమస్యలపై చట్టబద్ధంగా పోరాడాలని తెలిపారు. బెదిరింపులకు పాల్పడొద్దన్నారు. ఎవరికైనా సమాచారం ఉంటే ములుగు ఎస్పీ - 87126 70100, ములుగు డీఎస్పీ - 87126 70103, ఏటూరు నాగారం ఏఎస్పీ - 87126 70104, ఏటూరునాగారం సీఐ - 8712670113, ఏటూరునాగారం ఎస్సై - 87126 70090 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ఏనుమాముల మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్ సిటీ, జూలై 25: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ కమిటీ కార్యదర్శి పోలెపాక నిర్మల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం వారాంతపు యార్డు బంద్, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం బోనాల పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం సెలవు ప్రకటించిందని పేర్కొన్నారు. రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని కార్యదర్శి ఆ ప్రకటనలో కోరారు.

దామరతోగు ఎన్‌కౌంటర్‌లో భూపాలపల్లి వాసి మృతి

- తండ్రి సంవత్సరీకం రోజునే ఘటన
- కుటుంబ సమస్యల నేపథ్యంలోనే అడవిబాట





బుద్ధారంలోని నల్లమరి అశోక్ ఇల్లు, నల్లమరి అశోక్ (ఫైల్)

గణపురం, జూలై 25: ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సరిహద్దులోని గుండాల మండలం దామరతోగు వద్ద స్పెషల్ పార్టీ పోలీసులు, మావోయిస్టులకు మధ్య గురువారం జరిగిన ఎదురుకాల్పుల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం గ్రామానికి చెందిన నల్లమరి అశోక్ అలియాస్ విజేందర్ మృతిచెందాడు. బుద్దారం గ్రామానికి చెందిన నల్లమరి వీరస్వామి, రాజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. వారు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తుండేవారు. చిన్న కుమారుడైన అశోక్(40) స్థానికంగా పదో తరగతి పూర్తి చేసి కుటుంబసభ్యులతో పాటు వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలోనే అతడికి రెండుసార్లు వివాహం జరగ్గా.. ఇద్దరూ వదిలి వెళ్లిపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. అంతలోనే ఓ రోజు తాను నడుపుతున్న వాహనం రోడ్డు ప్రమాదానికి గురి కావడం, పలువురు మృత్యువాత పడడం, అంతకుముందే తల్లి మరణించడంతో మనోవేదనకు గురయ్యాడు. ఈ సమస్యలను తట్టుకోలేక కుంగిపోయిన అశోక్ అప్పటికే తాను ఇష్టపడిన నక్సలిజం వైపు వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. 2017లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఏడేళ్ల అనంతరం పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఇదిలా ఉంటే గురువారం అశోక్ తండ్రి వీరస్వామిది సంవత్సరీకం కాగా.. అదే రోజు ఎన్‌కౌంటర్‌లో అశోక్ మృతిచెందడం ఆ కుటుంబానికి తీరని దుఃఖాన్ని మిగిల్చింది.

పలిమెల మండల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 25: పలిమెల మండల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో గురువారం సమావేశం అయిన కలెక్టర్ పలిమెల మండల ప్రజల సౌకర్యాల కల్పనపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పలిమెల మండలాన్ని అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు శాఖల వారిగా కార్యచరణ తయారుచేయాలని తెలిపారు. ఇటీవల పలిమెల మండలంలో పర్యటించినప్పుడు తన దృష్టికి పలు సమస్యలు వచ్చినట్లు పేర్కొన్నారు. మండలంలో దమ్మూరు గ్రామానికి వ్యవసాయనికి త్రీఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేయడంతో పాటు మోదేడు, కమాన్‌పల్లి, బోడాయిగూడెం గ్రామాల్లో గిరివికాస్ కింద బోర్లు వేయాలని సూచించారు. మండల కేంద్రంలో 108 అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తేవాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గ్రామా లకు మెరుగైన విద్యుత్ సరఫరాతో పాటు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మధుసూదన్, ఆర్డీఓ మంగిలాల్, డీఆర్డీఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వృక్షం కింద పడి యువకుడి దుర్మరణం

రోడ్డుపై ప్రయాణిస్తుండగా ఘటన





ఘటనా స్థలంలో జహంగీర్ మృతదేహం, జహంగీర్ (ఫైల్‌ఫొటో)

ఏటూరునాగారం రూరల్, జూలై 25: ద్విచక్రవాహనంపై వెళుతున్న ఓయువకుడు.. రహదారి పక్కనున్న భారీ వృక్షం విరిగి పడి మృతిచెందిన సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన సయ్యద్, మహబూబీ దంపతుల కుమారుడు ఎస్కే జహంగీర్(30) స్వగ్రామంలోనే మెడికల్ షాపును నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మెడికల్ షాపు పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై మండలకేంద్రానికి వెళుతుండగా 163వ జాతీయ రహదారిపై చిన్నబోయినపల్లి- ఏటూరునాగారం మార్గమధ్యలోని పోతురాజు బోరు వద్దకు చేరుకోగానే భారీ వృక్షం ఒక్కసారిగా విరిగి అతడిపై పడింది. దీంతో జహంగీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై తాజుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రోడ్డుకు అడ్డగా పడిన చెట్టును తొలగించి జహంగీర్ మృతదేహాన్ని మండలకేంద్రంలోని సామాజిక ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సయ్యద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నారు. అయితే జహంగీర్‌కు ఈ ఏడాది ఏప్రిల్‌లో నిశ్చితార్థం కాగా సెప్టెంబరులో వివాహం జరగాల్సి ఉంది. ఈ ఘటనతో చిన్నబోయినపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.



నేడు కార్గిల్ విజయ్ దివస్

హాజరుకానున్న అమర జవాన్ల కుటుంబాలు ● మరిపెడలో ఏర్పాట్లు పూర్తి

మరిపెడ, జూలై 25: విద్రోహశక్తుల నుంచి పొంచిఉన్న ముప్పును రాత్రనకా, పగలనకా ఎముకలు కొరికే చలిలో నిద్రాహారాలు లేకుండా దేశరక్షణ కోసం శత్రుమూకల కదలికలను పసిక డుతూ భారత్‌ను కాపాడడానికి వారి ప్రాణాన్ని అరచేతిలో పెట్టుకొని సైనికులు రక్షిస్తున్నారు. శత్రుమూకల దొంగదెబ్బకు బలియైనోళ్లు ఎందరో ఉన్నారు. వారే మనవీర సైనికులు. పాకిస్తాన్-ఇండియాకు 1999-2001 మధ్య జరిగిన కార్గిల్ యుద్ధం ఈ తరం ప్రజలకు తెల్సిందే! ఈ అమరులైన జవాన్ల జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం ఏటా జూలై 26వ తేదీని కార్గిల్ విజయ్ దివస్‌గా ప్రకటించింది.

మరిపెడలో యుద్ధ వీరుల స్తూపం

కార్గిల్ యుద్ధవీరుల సంస్మరణార్థం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపల్ కేంద్రంలో కార్గిల్ స్థూపాన్ని 'కార్గిల్ ట్రస్ట్' ద్వారా చిల్లం చర్లకు చెందిన గాదె రాంబాబు నిర్మించారు. ఆ యుద్ధంలో అమరుడైన వీరజవాన్ పద్మపాణి ఆచార్య తల్లి విమలాచార్య, అప్పటి మంత్రి రెడ్యానాయక్ 2004 జూలై 23న ఆవిష్కరించారు. నాటి నుంచి ఏటా కార్గిల్ విజయ్ దివస్‌ను మరిపెడలో నిర్వహిస్తున్నారు.

ఉమ్మడిజిల్లాకు చెందిన వీరులు వీరే..

కార్గిల్ యుద్ధంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఐదుగురు జవాన్లు వీరమరణం పొందారు. మరొకరు అంగవైకల్యంతో ఉన్నారు. వర్ధన్నపేట మండలం కరాడిగూడెంకు చెందిన పి.దేవేందర్‌రెడ్డి, కరీమాబాద్ వాసి మాడి శెట్టి సతీశ్, స్టేషన్‌ఘన్‌పూర్ చంద్రశేఖర్, డోర్నకల్ మండలం ఉయ్యాలవాడకు చెందిన బానోత్ లచ్చిరాంనాయక్ వీర మరణం పొందగా, కాజీపేటకు చెందిన గాదె కశ్యప్‌రెడ్డి రెండు కాళ్లు పోగొట్టుకున్నారు.

ఏర్పాట్లు పూర్తి

మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని కార్గిల్ స్థూపం దగ్గర శుక్రవారం కార్గిల్ విజయ్‌దివస్‌ను ఘనంగా నిర్వహించడానికి కార్గిల్ సోల్జర్స్ ట్రస్ట్ నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ వేడుకలకు ప్రజాప్రతి నిధులతో పాటు మాజీ సైనిక కుటుంబాలు, విద్యార్థులు, యువత పాల్గొనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

'బైపాస్ సర్జరీ' ఉద్యోగి బదిలీ రద్దు

ఆంధ్రజ్యోతి కథనంతో బల్దియా అధికారుల్లో చలనం

ఉత్తర్వులు జారీ చేసిన ఆర్‌డీఎంఏ షాహిద్ మసూద్

వరంగల్ కార్పొరేషన్, జూలై 25: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన బదిలీలలో అధికారులు చేసిన డొల్లతనం బట్టబయలైంది. బల్దియా, ఆర్‌డీఎంఏ కార్యాలయంలో పని చేస్తున్న కొందరు అధికారులు ఒకరికి బదులు మరొకరిని, అందులో స్పౌజ్ అర్హతతో పాటు బైపార్ సర్జరీ చేసుకున్న సీనియర్ అసిస్టెంట్‌ను బదిలీ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'బల్దియా బదిలీల్లో అవకతవకలు' అనే శీర్షికన వార్తాకథనం ప్రచురితమైంది. దీనిపై బల్దియా అధికారులతో పాటు హైదరాబాద్ ఇన్‌చార్జి సీడీఎంఏ గౌతమ్ స్పందించినట్టు తెలిసింది. బల్దియా బదిలీలలో జరిగిన లొసుగులపై పూర్తి విచారణ చేపట్టి బాధితుడికి న్యాయం చేయాలని ఆదేశించినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో బల్దియా అధికారులు సీనియర్ అసిస్టెంట్లు ఎంత మంది బదిలీకి ఆప్షన్ పెట్టుకున్నారు? ఎవరు అర్హులు? ఎందుకు తప్పు జరిగింది? అని పునరాలోచించుకున్నట్లు తెలిసింది. అన్ని కోణాల్లో నుంచి సమాచారం సేకరించిన తర్వాత ఒక కొలిక్కి వచ్చారు. వరంగల్ బల్దియా కాశిబుగ్గ సర్కిల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఖమ్మం మున్సిపాలిటీకి బదిలీ చేయబడ్డ ఈసంపెల్లి ఇజ్రాయెల్ బదిలీ ఆర్డర్‌ను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయితే దరఖాస్తు చేసుకున్న 22 మంది సీనియర్ అసిస్టెంట్లలో బదిలీకి అర్హత జాబితాలో మొదటి పేరు గల బొట్ల రమేష్‌ను ఖమ్మంకు బదిలీ చేస్తూ ఆర్‌డీఎంఏ షాహిద్ మసూద్ సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇజ్రాయెల్‌ను కార్యాలయానికి పిలిపించి రిటైన్డ్ ఎట్ డబ్ల్యూఎంసీ ఆర్డర్ పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆంధ్రజ్యోతికి ఇజ్రాయెల్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆప్షన్ పెట్టుకున్న ప్రకారమే బదిలీ

సీనియర్ అసిస్టెంట్లు పెట్టుకున్న ఆప్షన్ ప్రకారం బదిలీల పక్రియ జరిగిందని, బదిలీలలో అవకతవకలు జరగలేదని ఆర్‌డీఎంఏ కార్యాలయం సిబ్బంది వివరణ ఇచ్చారు. సీనియర్ అసిస్టెంట్ ఇజ్రాయెల్ జీడబ్ల్యూఎంసీ, నర్సంపేట, మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెంకు వెళ్లేందుకు ప్రాధాన్యతను బట్టి దరఖాస్తు చేసుకున్నాడని, 4వ జోన్‌లో ముందు వరసలో బొట్ల రమేష్, జి.దేవరాజ్, ఇమ్మడి ఇజ్రాయెల్, ఎం.సుధాకర్ (ఖమ్మం) ఉద్యోగులు ఉన్నారన్నారు. వీరిలో ఆప్షన్‌లో పేర్కొన్న ప్రకారం బదిలీ చేశామన్నారు. అయితే ముందుగా కొత్తగూడెంలో పని చేస్తున్న సుధాకర్ అనే ఉద్యోగికి మహబూబాబాద్‌కు, ఇజ్రాయెల్‌ను ఖమ్మకు బదిలీ చేశామన్నారు. పైనుంచి ఆదేశాలు అందడంతో మొదటి స్థానంలో సీనియారిటీ ప్రకారం ఇజ్రాయెల్ బదిలీని రద్దు చేస్తూ బొట్ల రమేష్‌ను ఖమ్మంకు బదిలీ చేస్తూ సవరణ ఉత్తర్వులు జారీ చేసినట్టు అధికారులు వెల్లడించారు.

నేడు, రేపు ఎస్సీ గురుకుల జూనియర్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 25: హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం నేడు, రేపు స్పాట్ నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీవో ఎస్.విద్యారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 విద్యా సంవత్సరంలో రెగ్యులర్‌గా పాసైన విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉందని ఆమె తెలిపారు. బాలికల ప్రవేశాల కోసం శుక్రవారం మడికొండలోని బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే బాలుర ప్రవేశాల కోసం శనివారం మడికొండలోని బాలుర కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు వారి ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో ఉదయం 8 గంటలకల్లా కళాశాలలో ఉండాలని తెలిపారు. గతంలో ఆర్‌సీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు స్పాట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని ఆమె తెలిపారు.

రుణాల రికవరీపై దృష్టి పెట్టండి : మార్నేని


మాట్లాడుతున్న చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 25: డీసీసీ బ్యాంకు పరిధిలోని రుణాల రికవరీపై దృష్టి పెట్టాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో లోన్ పాలసీ మేకింగ్ కమిటీ, డిస్ట్రిక్ లెవెల్ మానిటరింగ్ అండ్ రివ్యూ కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. రుణాల మంజూరు, రికవరీ, విద్యా రుణాలు, బంగారు ఆభరణాల రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, డిపాజిట్లు తదితర అంశాలపై రవీందర్‌రావు సమీక్ష జరిపి అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీసీసీ బ్యాంకు వైస్‌చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు జగన్‌మోహన్, చాపల యాదగిరి, మురళీ, డీసీవో నాగేశ్వర్‌రావు, సీఈవో వజీర్ సుల్తాన్, జీఎం ఉషా, టెస్కాబ్ నోడల్ ఆఫీసర్ లత, నాబార్డు డీడీయం చంద్రశేఖర్ తదితర బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

చింతన

మనిషి జన్మకు పరమార్థం ఏమిటన్నది చిరకాల ప్రశ్న. సమాధానాలు అనేకం ఉన్నా 'ముక్తి సాధన' అనేది ఏ ఒక్కరూ కాదనలేనిది. దీనికి మరో పేరు 'మోక్ష ప్రాప్తి'. జనన, మరణ బంధం నుంచి విమోచన పొందడం అన్నమాట. అంటే, ఆ చక్రం నుంచే బయటపడటం. ఇది మాటలు, రాతలు కాదు... చేతలతోనే సాధ్యమవుతుంది. దీనికి ఏకైక మార్గం... ప్రతీ వ్యక్తి ఆత్మజ్ఞానం కలిగి ఉండడమే. ఎవరి గురించి వారు తెలుసుకోవాలంటే దైవశక్తినే సాధనంగా భావించాలి. తెలుసుకునే క్రమంలో మన ముందు నాలుగు మార్గాలు కనిపిస్తాయి.. అవన్నీ 'గ'కారంతో మొదలయ్యేవే. అంటే... 'గ'కార చతుష్టయం. అవి: గీత, గంగానది, గాయత్రీ మంత్రం, గోవింద నామం. నిత్యజీవితంలో వీటి స్మరణ మానవ జీవితానికి సార్థకత కలిగిస్తుందని భారతీయ సంస్కృతిని చాటి చెబుతోంది. అదే విషయాన్ని 'ఆత్మ నివేదనం' పేరిట విపులీకరిస్తోంది. 'నివేదన' అంటే 'సమర్పణ' అని అర్థం. మనసును, వాక్కును, కర్మను కేంద్రీకరించడం. ఈ కేంద్రీకరణ ద్వారానే స్వీయ పరిశీలన వేగవంతమవుతుంది.



ముక్తి సాధన కోసం...
గకార చతుష్టయం

చతుర్వేదాల సారాంశం

'గ'కార చతుష్టయంలో మొదటిది భగవద్గీత. ఇందులో ఉన్నదంతా వేద విజ్ఞాన సారం. వేదాలు నాలుగు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వ వేదం. 'వేదం' అనేది 'విద్' (తెలియడం) నుంచి ఏర్పడింది.

ఋగ్వేదం అంటే దేవ వేదమే. ఇందులోని కొన్ని సూక్తాలు పురాణాలను, సామాజిక వర్తనను వివరిస్తాయి. యజుర్వేదం యజ్ఞ నిర్వహణ రీతిని తెలుపుతుంది. మధురతకు సూచిక సామ వేదం. అంతేకాక, సకల జ్ఞాన ప్రదాయని. అథర్వ(ణ) వేదం ఆ ఋషి పేరు మీదుగా వచ్చింది. ఇందులోనూ శాస్త్రీయ పరిజ్ఞాన వైభవం కనిపిస్తుంటుంది. చతుర్వేదాల సారాంశ సమాహారం కాబట్టే.. భగవద్గీతకు అంతటి ప్రసిద్ధి, విశిష్టత కలిగాయి.

వేదమాత

గాయత్రీదేవి వేదమాతగా ప్రశస్తి అందుకుంది. 'గయలు' అంటే ప్రాణాలు. 'త్రాయతే' అనే పదానికి పరిరక్షణ అని అర్థం. అందుకే ప్రాణ సంరక్షకురాలుగా గాయత్రిని ఆరాధిస్తారు. గాయత్రీ మంత్రంలోని "ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యమ్'ను పరిశీలిస్తే... 'ఓం (సర్వ రక్షణ), భూ (ఉనికి), భువ (జ్ఞాన రూపం), స్వ (ఆనంద స్వరూపం), తత్ (అటువంటి లక్షణ సమన్విత పరమేశుడు), సవితు (విశ్వ కర్త) వరేణ్యం (సర్వులతో ఆరాధనీయులు)' అనే భావార్థాలు ఇమిడి ఉన్నాయి. ఇవన్నీ సంప్రదాయ పరంగా, శాస్త్రీయంగా కూడా ప్రామాణికాలు.





అనంత ఫలప్రదం

ఇక గోవింద నామం... 'గకార చతుష్టయంలో దీని పాత్ర అనంతం. 'శ్రీనివాసా, శ్రీవేంకటేశా, నిత్య నిర్మలా, భక్త వత్సలా, దినకర తేజా' అని స్మరణలు చేస్తారు ఆరాధకులు. 'గోవింద' అంటే భూ పరిరక్షకుడు. వేదాల వల్ల ఘనతరుడనే అంతరార్థమూ ఉంది. గోవింద నామం అనంత ఫలప్రదం.

యోగవిద్యకు సంబంధించి సాధన చతుష్టయమనే మాట వివిపిస్తూ ఉంటుంది. వివేకంతో వ్యవహరించడం, యథాతథ స్థితిని గ్రహించగలగడం, సంపత్ లేదా సమతుల్యతను కోరుకోవడం, ఆత్మ జ్ఞాన ప్రాప్తికి పలు విధాలుగా ప్రయత్నించడం. ఇదంతా అభ్యాస సాధనాల క్రమం. వీటన్నిటి ఫలితంగా స్వయం పరిశీలన శక్తి విస్తారమవుతుంది. క్రమేణా ముక్తి ప్రాప్తికి మార్గం సులభతరంగా మారుతుంది.

మానసిక, నైతిక పరమోన్నత స్థితే ముక్తి. అంటే... వ్యక్తి తన సహజత్వాన్ని పొందగలగడం. దీనికి మూలాధారం ఆత్మ నివేదన. దైవం పట్ల పరిపూర్ణ ప్రేమను వ్యక్తపరచే రీతి. భక్తి మార్గాలు ఎన్నో ఉంటాయి. వాటన్నిటికన్నా నివేదన విధానమే భగవంతుడిని, భక్తుడిని అనుసంధానిస్తుంది. పత్రం, పుష్పం, ఫలం, చివరికి నీటినైనా భక్తితో సమర్పిస్తే ప్రీతిగా స్వీకరిస్తానన్నది గీతాచార్యుడి మాట. నిజానికి మనిషి శరీరం ఆకు వంటిదే. రాలిపోతుందే తప్ప, శాశ్వతం కాదు. అందువల్ల పత్ర అర్చనకు ఆ వ్యక్తి సంసిద్ధం కావాలి. తన మనోవనంలోని మొగ్గను పుష్పంలా వికసింప చేయాలి. ఆ వికసిత పుష్పమే విజ్ఞాన ఫలంగా రూపాంతరం చెందడాన్ని సమర్పణగా వర్ణిస్తుంది మన భారతీయ ధార్మిక చింతన. పవిత్ర గీత, పావన గంగ, శక్తిదాయక గాయత్రి, స్ఫూర్తిప్రదాయ గోవింద స్మరణలకు మనను మనం సమర్పించుకుంటేనే జీవితాలకు ధన్యత. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, భక్తి జ్ఞాన కర్మ యోగాదులు చాటి చెబుతున్నది ఇటువంటి ఆత్మ సమర్పణ పద్ధతినే.

• జంధ్యాల శరత్‌బాబు
99483 45013

భువనపావని...

యమున, కృష్ణా, గోదావరి, కావేరి, సింధు, నర్మదలతో పాటు సప్త నదుల్లో ఒకటి గంగ. 'భువన పావని', 'అనంత వాహిని' అనేవి దాని నామాంతరాలు. మన సంస్కృతి, చరిత్ర, వ్యవస్థ అంతా గంగానదితో మమేకమై ఉంది. గంగమ్మ తల్లిగా, గంగా భవానీగా పిలిచేది అందుకే. గంగను నీటికి పర్యాయపదంగా మనం ఉపయోగిస్తాం.. గంగ మరెన్నో నదులతో కలసి మహా ప్రవాహంగా మారుతుంది. ఆ జల స్నానం భారతీయులకు పరమ పవిత్రం. గంగా, యమున, సరస్వతీ నదుల సంగమ స్థలాన (త్రివేణి) కుంభ మేళాలు ఏర్పాటవుతుంటాయి. అలహాబాద్ (ప్రయాగ)లో ఈ మహోత్సవం వచ్చే ఏడాది జనవరిలో మొదలవుతుంది. ఇంతటి మేటి విశిష్టత కారణంగా... గంగ విశ్వ విఖ్యాతి పొందింది.

సుభాషితం

సజ్జన లక్షణాలు

ప్రదానం ప్రచ్ఛన్నం గృహ ముపగతే సంభ్రమవిధిః
ప్రియంకృత్వా మౌనం సదసి కథనం చాప్యుపకృతేః
అనుత్సేకో లక్ష్మ్యాం నిరభిభవసారాః పరకథాః
సతాం కేనోద్దిష్టం విషమ మసిధారావ్రత మిదమ్



సజ్జనుల్లో సహజంగా ఉండే లక్షణాల గురించి 'నీతి శతకం'లో భర్తృహరి వివరించిన శ్లోకం ఇది. దీన్ని...

పొసగన్ దానము గుప్త మర్థి భవనంబు జేరుచో సంభ్రమో
ల్లసదుత్థానవిధానముం బ్రియవిధుల్ గావించి మౌనంబు రా
జసభన్ మిత్రకృత ప్రకాశనము గుత్సాకర్ణ వైముఖ్య మీ
యసిధారావ్రతచర్య యెవ్వడు మహార్యశ్రేణికిం దెల్పెనో... అంటూ ఏనుగు లక్ష్మణకవి సముచిత రీతిలో తెలుగువారికి సమర్పించాడు.

భావం: దానాలు చేస్తున్నానని చాటింపు వేసుకోకుండా రహస్యంగా చేయడం. ఇంటికి వచ్చి యాచించిన వారిని ఆదరించడం. వేరొకరికి తను చేసిన మేలు గురించి ప్రచారం చేసుకోకపోవడం, వేరొకరు తనకు చేసిన మేలును పదిమందికీ చెప్పడం, ఎన్ని సంపదలు వచ్చినా వినయంగా ఉండడం, పరుల గురించి చెడ్డగా మాట్లాడకపోవడం... వీటన్నిటినీ పాటించడం కత్తిమీద సాములాంటిది. ఈ గుణాలు ఎవరో బోధిస్తేనో, నేర్పితేనో రావు. సజ్జనుల్లో ఈ లక్షణాలు స్వతస్సిద్ధంగా ఉంటాయి.

సద్బోధ

యోగి- సాధువు

పూర్వం ఒక యోగి అకుంఠితమైన తపస్సు చేసి, కొన్ని గొప్ప శక్తులను సంపాదించాడు. అతను స్వతహాగా మంచివాడు. కానీ తన శక్తులంటే అతనికి గర్వం ఉండేది. వాటిని ప్రదర్శించాలనే కోరిక ఉండేది. ఆ గర్వాన్ని తగ్గించాలని దేవుడు అనుకున్నాడు. ఒక రోజు... సాధువు రూపంలో ఆ యోగి దగ్గరకు వచ్చాడు. "స్వామీ! మీకు అద్భుతమైన శక్తులు ఉన్నాయని విన్నాను. మిమ్మల్ని దర్శించుకోవాలని వచ్చాను" అని అన్నాడు. మాటలు విన్న యోగి ఉప్పొంగిపోయాడు. మునిని సాదరంగా ఆహ్వానించి, ఆతిథ్యం ఇచ్చాడు.

ఈలోగా అటువైపు ఒక ఏనుగు వెళుతోంది. సాధువు దాన్ని చూపిస్తూ "స్వామీ! మీరు కోరుకుంటే ఆ ఏనుగును చంపగలరా?" అని అడిగాడు.

."ఎందుకు చంపలేను? ఇదిగో చూడండి" అంటూ నేల మీద పిడికెడు మట్టి తీసుకున్నాడు యోగి. దాన్ని మంత్రించి ఏనుగు మీదకు విసిరాడు. ఆ ఏనుగు నొప్పితో విలవిలలాడుతూ నేల మీద పడి మరణించింది.

'చూశావా!' అన్నట్టు గర్వంగా తలాడించాడు యోగి.


"మీ శక్తులు అమోఘం స్వామీ! మీరు ఏనుగును చంపేశారు. మరి దాన్ని మళ్ళీ బతికించగలరా?" అని అడిగాడు సాధువు.

"తప్పకుండా" అంటూ మరికాస్త మట్టి తీసుకొని, మంత్రించి, మరణించిన ఏనుగు మీద చల్లాడు యోగి. ఆ ఏనుగు లేచి నిలబడింది. శరీరానికి అంటుకున్న దుమ్మును విదిలించుకుంటూ అడవిలోకి నడిచింది.

"స్వామీ! మీకు అపారమైన శక్తులు ఉన్నాయి. కానీ నాకొక సందేహం ఉంది తీరుస్తారా?" అన్నాడు సాధువు.

"దానికేం? అడగండి" అన్నాడు యోగి.

"మీరు ఏనుగును చంపారు. దాన్ని మళ్ళీ బతికించారు. కానీ అందువల్ల మీకు కలిగిన ప్రయోజనం ఏమిటి? ఆధ్యాత్మికమైన ఉన్నతి కలిగిందా? మోక్షాన్ని, భగవంతుణ్ణి చేరే మార్గం దొరికిందా?" అని ప్రశ్నించాడు సాధువు.



ఆ మాటలకు యోగి దిగ్భ్రాంతి చెందాడు. సాధువు రూపంలో ఉన్న దేవుడు చిరునవ్వు నవ్వుతూ మాయమైపోయాడు. ఇంతసేపూ తన ముందు ఉన్నది సాక్షాత్తూ భగవంతుడేనని యోగికి అర్థమయింది. ఆ క్షణం నుంచి అతనిలో గర్వం, కోరికలు పూర్తిగా సమసిపోయాయి.

శ్రీ రామకృష్ణ పరమహంస తన శిష్యులకు ఈ కథ చెబుతూ "సూది బెజ్జానికి అడ్డుగా కంటికి కనిపించని చిన్న నలుసు ఉన్నా సరే.. దానిలోంచీ దారం వెళ్ళడం కష్టమవుతుంది. అదే విధంగా సాధకుల్లో ఇసుకరేణువంత కోరిక, గర్వం మిగిలి ఉన్నా.. పరమాత్మ తత్త్వాన్ని గ్రహించలేరు. మోక్షపథాన్ని అందుకోలేరు" అని స్పష్టం చేశారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MNuqlklలో చదవండి.

బిజినెస్

టెక్ మహీంద్రా లాభంలో 23% వృద్ధి

క్యూ1లో రూ.851 కోట్లుగా నమోదు.. రూ.13,005 కోట్లకు తగ్గిన ఆదాయం

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ) టెక్ మహీంద్రా రూ.851 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి గడించిన రూ.692.5 కోట్ల లాభంతో పోలిస్తే, ఈసారి 23 శాతం వృద్ధి నమోదైంది. కాగా, ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.2 శాతం తగ్గి రూ.13,005 కోట్లకు పరిమితమైంది. ఆదాయం తగ్గినప్పటికీ, మొత్తం వ్యయాలు 2.3 శాతం తగ్గి రూ.955 కోట్లకు పరిమితం కావడం, వడ్డీ ఖర్చులు 40 శాతం తగ్గి రూ.715 కోట్లకు దిగిరావడం లాభాల్లో మెరుగైన వృద్ధికి దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మరింత మెరుగైన పనితీరు కనబర్చనుందని టెక్ మహీంద్రా కొత్త ఎండీ, సీఈఓ మోహిత్ జోషి అన్నారు.

- సేవల వ్యయం తగ్గడంతో క్యూ1లో కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ మరో 1.9 శాతం పెరిగి 12 శాతంగా నమోదైంది. ఇకపై లాభాల మార్జిన్ క్రమంగా పుంజుకోనుందని మోహిత్ జోషి అన్నారు.
- గడిచిన మూడు నెలల్లో కంపెనీ 53.4 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్‌ను కుదుర్చుకుంది. అయితే, ఐటీ రంగం ఇంకా అనిశ్చితిలోనే కొనసాగుతోందని, ఈ మధ్యనే చేపట్టిన పునర్వ్యవస్థీకరణ ప్రణాళిక కంపెనీకి దోహదపడుతోందని జోషి పేర్కొన్నారు.



6,000 మంది ఫ్రెషర్ల నియామకాలు

గత మూడు నెలల్లో టెక్ మహీంద్రా ఉద్యోగులు నికరంగా 2,165 మంది పెరిగారు. దాదాపు 1,000 మంది ఫ్రెషర్ల నియామకాలతో పాటు బీపీఓ విభాగంలో మరింత మందిని చేర్చుకున్నట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల ద్వారా 6,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలనుకుంటున్నట్టు కంపెనీ ఇదివరకే ప్రకటించింది.

ద్వితీయార్థంలో సిబ్బందికి వేతన పెంపు

తమ కంపెనీలో పనిచేస్తున్న 1.47 లక్షలకు పైగా ఉద్యోగులకు వేతనాన్ని పెంచాలనుకుంటున్నట్టు జోషీ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో (2024 అక్టోబరు-2025 మార్చి) పెంపు ఉంటుందని, ఇదే విషయాన్ని సిబ్బందికి తెలియజేయడం జరిగిందన్నారు. ఐటీ రంగ కంపెనీలకు ఉద్యోగుల జీతాలే ప్రధాన వ్యయం.

పసిడి పడుతోంది..

న్యూఢిల్లీ: పసిడి, వెండి ధరలు వరుసగా మూడో రోజూ తగ్గుముఖం పట్టాయి.ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం మరో రూ.1,000 తగ్గి రూ.70,650 స్థాయికి జారుకుంది. కిలో వెండి ఏకంగా రూ.3,500 తగ్గడంతో ధర రూ.84,000కు దిగివచ్చింది. అంతర్జాతీయంగా వీటి ధరలు గణనీయంగా తగ్గడంతో పాటు దేశీయ బులియన్ మార్కెట్లోనూ జువెలర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. గడిచిన మూడు రోజుల్లో తులం బంగారం రూ.5,000 తగ్గింది. ఈ విలువైన లోహాలపై కస్టమ్స్ సుంకాన్ని 6 శాతానికి తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించడంతో ఈనెల 23న గోల్డ్ రేటు ఏకంగా రూ.3,350 పడిపోయి రూ.72,300 స్థాయికి జారుకుంది. ఈ ఏడాదిలో అదే అతిపెద్ద తగ్గుదల. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర ఒక దశలో 42.20 డాలర్లు తగ్గి 2,421 డాలర్ల స్థాయిలో ట్రేడవగా.. సిల్వర్ 28 డాలర్ల స్థాయికి పడిపోయింది.

మెటల్, బ్యాంకింగ్ షేర్లు పడేశాయ్..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టాలు చవిచూశాయి. గురువారం ట్రేడింగ్ ఆరంభంలోనే 671 పాయింట్ల వరకు క్షీణించి 79,500 దిగువ స్థాయికి జారుకున్న సెన్సెక్స్.. మళ్లీ క్రమంగా తేరుకుని చివరికి 109.08 పాయింట్ల నష్టంతో 80,039.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 203 పాయింట్ల మేర పతనమై 24,200 స్థాయికి జారుకుంది. చివర్లో 7.40 పాయింట్ల నష్టంతో 24,406.10 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో ఇన్వెస్టర్లు లోహం, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. మూలధన లాభాలపై పన్ను పెంచడంతో విదేశీ ఇన్వెస్టర్లు మన ఈక్విటీల నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడం కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.

30 నుంచి అకుమ్స్ డ్రగ్స్ ఐపీఓ: అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 30న ప్రారంభమై ఆగస్టు 1న ముగియనుంది. ఐపీఓలో విక్రయించనున్న షేర్ల బిడ్డింగ్ ధర శ్రేణిని కంపెనీ రూ.646-679గా నిర్ణయించింది. తద్వారా రూ.1,857 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది.

ఐపీఓకి స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.600 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ.250 కోట్ల మొత్తానికి కొత్తగా రూ.10 ముఖ విలువతో కూడిన ఈక్విటీ షేర్లు జారీ చేయటం ద్వారా సమీకరించనుంది. మిగిలిన రూ.350 కోట్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా సమీకరించనుంది. ఓఎఫ్ఎస్ ద్వారా 1.844 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు అవసరమైన స్పెషలైజ్డ్ ఇంజనీరింగ్ పరికరాల తయారీలో కంపెనీ కీలకంగా ఉంది.

సైయెంట్ లాభంలో 17శాతం క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో సైయెంట్ రూ.1,414 కోట్ల రెవెన్యూపై రూ.141 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 2.8 శాతం, లాభం 17 శాతం క్షీణించాయి. కరెన్సీ మారకం ప్రభావం జూన్ త్రైమాసిక ఫలితాలపై పడిందని, దీంతో డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ (డీఈటీ) వ్యాపారం క్షీణించిందని కంపెనీ పేర్కొంది, జూన్ త్రైమాసికంలో 5.24 కోట్ల డాలర్ల విలువైన ఆర్డర్లను కంపెనీ చేజిక్కించుకుంది. ఈ ఆర్డర్ల కారణంగా రానున్న త్రైమాసికాల్లో నిలకడైన వృద్ధిని కనబరచవచ్చని భావిస్తున్నట్లు సైయెంట్ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో సెమీకండక్టర్ విభాగంలోకి కంపెనీ అడుగుపెట్టిందని, ఇందుకోసం ప్రత్యేకంగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

48 శాతం తగ్గిన లారస్ ల్యాబ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి గాను లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ రూ.1,195 కోట్ల రెవెన్యూపై రూ.13 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 1 శాతం, లాభం 48 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో కీలకమైన సీడీఎంఓ క్లినికల్ ప్రాజెక్టుల్లో నిలకడైన పనితీరుతో పాటు అంకాలజీ ఏపీఐ, ఏఆర్‌వీ విభాగంలో పటిష్ఠమైన వృద్ధిని కనబరచటం కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు. ఈ కాలంలో కంపెనీ సీడీఎంఓ-సింథసిస్ వ్యాపారం రూ.214 కోట్లుగా ఉండగా ఏపీఐ రెవెన్యూ రూ.664 కోట్లుగా ఉంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,820 ▼	64,000 ▼	89,000 ▼
ముంబై	68,227 ▼	62,496 ▼	81,474 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	573	విశాఖపట్నం	485
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	104	విజయవాడ	104
వరంగల్	104	గుంటూరు	107
కరీంనగర్	104	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	120
కర్నూలు	104	నెల్లూరు	120
విశాఖపట్నం	93	అనంతపురం	104
గోదావరి	104		

మ్యాన్‌కైండ్ గూటికి బీఎస్‌వీ

- ఒప్పందం విలువ రూ.13,630 కోట్లు
- అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి కొనుగోలు

న్యూఢిల్లీ: భారత్ సీరమ్స్ అండ్ వ్యాక్సిన్స్ (బీఎస్‌వీ)లో 100 శాతం వాటాను రూ.13,630 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మ్యాన్‌కైండ్ ఫార్మా గురువారం ప్రకటించింది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి ఈ కంపెనీని చేజిక్కించుకుంది. బీఎస్‌వీ కోసం ఈక్వాటీ, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) కన్సార్షియం కూడా పోటీ పడినప్పటికీ అధిక ధరకు బిడ్డింగ్ వేయడం ద్వారా మ్యాన్‌కైండ్ ఈ సంస్థను హస్తగతం చేసుకుంది. బీఎస్‌వీ కొనుగోలు మ్యాన్‌కైండ్ వ్యాపారాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లనుంది. మహిళల ఆరోగ్యం, సంతాన సాఫల్య ఔషధాల మార్కెట్లో అగ్రగామిగా నిలపనుంది. అలాగే, క్రిటికల్ కేర్‌లో ఇతర ఉత్పత్తుల్లోకి ప్రవేశం కల్పించనుంది. బయోఫార్మాస్యూటికల్స్‌లో ఐదు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన బీఎస్‌వీ.. మహిళ ఆర్యోగానికి సంబంధించి సంతాన సాఫల్యం నుంచి ప్రసవం తర్వాత సంరక్షణలో ఉపయోగించే పలు సంక్లిష్ట ఉత్పత్తులను మార్కెట్లో విక్రయిస్తోంది. "మ్యాన్‌కైండ్ ప్రయాణంలో బీఎస్‌వీ కొనుగోలు కీలక మైలురాయి. మహిళల ఆరోగ్యం, ఫెర్టిలిటీ మార్కెట్లో తమను అగ్రసంస్థగా నిలబెడుతుంది. భవిష్యత్‌లో ఈ విభాగం అపార అవకాశాలు అందించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా బలమైన వ్యాపార వృద్ధికి బాటలు వేయనుందని భావిస్తున్నా"మని మ్యాన్‌కైండ్ ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ రాజీవ్ జునేజా అన్నారు.



పిట్టీ ఇంజనీరింగ్ చేతికి దక్షిణ్ ఫౌండ్రీ

డీల్ విలువ రూ.153 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్షిణ్ ఫౌండ్రీ ప్రైవేట్ లిమిటెడ్ (డీఎఫ్‌పీఎల్)లో 100 శాతం వాటాలను రూ.153.12 కోట్లకు కొనుగోలు చేసినట్లు పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. డీఎఫ్‌పీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న పదిహేను రోజుల్లో ఈ డీల్‌ను పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి డీఎఫ్‌పీఎల్ వద్ద రూ.42.71 కోట్ల నగదు, బ్యాంక్ బ్యాలెన్స్ ఉంది. డక్టైల్ ఐరన్, గ్రే ఐరన్, లో కార్బన్ అల్లాయ్ స్టీల్ గ్రేడ్స్, సిమో ఐరన్ కాస్టింగ్స్ తయారీలో డీఎఫ్‌పీఎల్ కీలకంగా ఉంది. బెంగళూరు, హోస్కోట్‌లో ఏటా 4,200 టన్నుల స్థాపిత సామర్థ్యం కలిగిన రెండు ప్లాంట్లను నిర్వహిస్తోంది. డీఎఫ్‌పీఎల్ కొనుగోలుతో పిట్టీ ఇంజనీరింగ్ ఉత్పత్తి సామర్థ్యపరంగా మరింత బలోపేతం కానుందని సంస్థ ఎండీ అక్షయ్ ఎస్ పిట్టీ తెలిపారు.

స్థిరాస్తుల అమ్మకాల లాభాలపై కొత్త కొర్రీ

- వడ్డీ, స్టాంప్ డ్యూటీలు ఖర్చులు యథాతథం

న్యూఢిల్లీ: స్థిరాస్తుల అమ్మకాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ) తగ్గించామని చెబుతూనే.. ప్రభుత్వం పెద్ద బాంబు పేల్చింది. ఈ లాభాల లెక్కింపు కోసం ఆస్తుల కనీస విలువను లెక్కించేటప్పుడు, వాటిని కొనేటప్పుడు చెల్లించే స్టాంప్ డ్యూటీ, అప్పు చేసి కొంటే.. ఆ అప్పులపై చెల్లించే వడ్డీల భారం.. ప్రస్తుతం ఉన్న విధంగానే లెక్కింపులోకి రాదని స్పష్టం చేసింది. కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా గురువారం ఈ విషయం వెల్లడించారు. కొత్త ఎల్‌టీసీజీటీ విధానంలోనూ ఇదే పద్ధతి కొనసాగుతుందన్నారు. దీంతో ద్రవ్యోల్బణం ఆధారంగా లెక్కించే ఇండెక్సేషన్ ఖర్చుల ప్రయోజనం రద్దయి, స్థిరాస్తుల దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను భారం 20 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గినా అమ్మకందారులకు పెద్దగా ప్రయోజనం లేదని భావిస్తున్నారు.

కెనరా బ్యాంక్ లాభం రూ.3,905 కోట్లు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ ముగిసిన త్రైమాసికంలో రూ.3,905 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.3,535 కోట్లతో పోల్చితే లాభం 10 శాతం పెరిగింది. మొండి బకాయిలు తగ్గడం ఇందుకు దోహదపడింది. కాగా బ్యాంక్ త్రైమాసికాదాయం రూ.29,823 కోట్ల నుంచి రూ.34,020 కోట్లకు పెరిగింది. వడ్డీల ద్వారా జూన్ త్రైమాసికంలో రూ.28,701 కోట్లు ఆదాయం లభించింది. నికర వడ్డీ ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.8,666 కోట్ల నుంచి రూ.9,166 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ మాత్రం 3.05 శాతం నుంచి 2.90 శాతానికి తగ్గింది. భవిష్యత్తులో ఎన్ఐఎం మెరుగుపడి 2.95 శాతం వద్ద స్థిరపడుతుందని భావిస్తున్నట్టు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణ రాజు చెప్పారు. ఆస్తుల నాణ్యత విషయానికి వస్తే బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 5.15 శాతం నుంచి 4.14 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 1.57 శాతం నుంచి 1.24 శాతానికి తగ్గాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు రూ.2,418 కోట్ల నుంచి రూ.2,171 కోట్లకు తగ్గాయి. బ్యాంక్ సీఆర్ఏఆర్ (క్యాపిటల్ అడిక్వసీ నిష్పత్తి) 16.28 శాతానికి పెరిగింది. ప్రొవిజన్ కవరేజి నిష్పత్తి (పీసీఆర్) 118 బేసిస్ పాయింట్లు పెరిగి 89.22 శాతానికి చేరింది. ఈ ఏడాది చివరికి పీసీఆర్ 90 శాతం దాటాలని బ్యాంక్ భావిస్తున్నదని రాజు చెప్పారు. ప్రతి త్రైమాసికంలోనూ రూ.1,000 కోట్లు మొండి బకాయిలు వసూలు చేయాలన్నది తమ లక్ష్యమన్నారు.



రూ.8,500 కోట్ల సమీకరణ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.8,500 కోట్ల నిధులు సమీకరించేందుకు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు అనుమతించిందని ఎండీ తెలిపారు. టియర్ 1, టియర్ 2 బాండ్ల ద్వారా ఈ నిధులు సమీకరిస్తామన్నారు. అలాగే తమ అనుబంధ సంస్థలు కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, కెనరా రొబెకో ఏఎంసీ రెండింటిలోనూ 25 శాతం వంతున వాటాలు విక్రయించాలని నిర్ణయించినట్టు రాజు వెల్లడించారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు

భూపాలపల్లిటౌన్, జూలై 25: సుప్రీం కోర్టు ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్య పరిష్కారం కోసం, సత్వర న్యాయం అందించుటకు గాను ఈ నెల 29 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ప్రత్యేక లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎవరైనా ఉంటే జిల్లాలోని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిని గానీ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హైదరాబాద్ వారిని గానీ సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 040-23446723, 0713-221418లను సంప్రదించాలని సూచించారు.. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.,

తగ్గుముఖం పడుతున్న గోదావరి

మహదేవపూర్ రూరల్/మహదేవపూర్ జూలై 25 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. గత రెండు రోజులుగా ప్రవాహం నిలకడగా ఉండగా గురువారం బ్యారేజీలోకి 7.70లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో 85గేట్లను ఎత్తి దిగువకు అంతే నీటిని పంపిస్తున్నారు. గురువారం బ్యారేజీ వద్ద 8మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది. కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 11, 500 మీటర్ల మేర నీటి మట్టం కొనసాగుతోంది.

సమ్మక్క బ్యారేజీ వద్ద..

కన్నాయిగూడెం, జూలై 25: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజి వద్ద గోదావరి గురువారం తగ్గుముఖం పట్టి ప్రవహిస్తూ ఉంది. ఎగువన ఉన్న బ్యారేజి గేట్లు ఎత్తి దిగువకు వరద నీళ్ల వదులుతుండడంతో పాటుగా ఉప నదులు అయిన ఇంద్రావతి , ప్రాణహిత నదుల వరద వచ్చి గోదావరిలోకి వచ్చి చేరుతుండడంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తూ ఉంది. బధవారం రాత్రి వరకు పెరుగుతూ వచ్చిన గోదావరి గురువారం ఉదయం నుంచి స్వల్పంగా తగ్గుతూ ప్రవహిస్తూ ఉంది. ఎగువ నుంచి 9,50,420 క్యూ సెక్కుల ఇన్ ఫ్లో వస్తుండటంతో బ్యారేజీలోని మొత్తం 59 గేట్లు ఎత్తిన ఇంజనీరింగ్ అధికారులు వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు వదులు తున్నారు.



రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద

ఏటూరునాగారం రూరల్ : గత కొన్ని రోజులుగా పెరుగుతూ వస్తున్న గోదావరి గురువారం తగ్గు ముఖం పట్టింది. మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గురువారం ఉదయం 8 గంటల 15.530 మీటర్లకు చేరువైన గోదావరి నీటిమట్టం ఉదయం 9 గంటలకు 15.520 చేరి క్రమంగా తగ్గుతూ వచ్చింది. సాయంత్రం 6 గంటలకు పుష్కఘాట్ వద్ద గోదావరి నీటి మట్టం 15.190 మీటర్లకు చేరింది. గోదావరి తగ్గుముఖం పడుతుండడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

వెంకటాపురం(నూగూరు), జూలై 25: మండలంలోని సుడిబాక, ఉప్పేడువీరాపురం గ్రామాల్లో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం వేర్వేరుగా వైద్యశిబిరాలు జరిగాయి. ఈసందర్భంగా ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శిబిరాల్లో వైద్యాధికారులు స్నేహ, అశీష సోహెల్, సిబ్బంది పాల్గొన్నారు.

'గిరిజనుల అభివృద్ధిని మరిచిన కేంద్రం'

వెంకటాపురం(నూగూరు), జూలై 25: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గిరిజనుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని ఆదివాసీ నవ నిర్మాణసేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్సా నర్సింహమూర్తి అన్నారు. గురువారం మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు గిరిజన యూనివర్సిటీపై ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ అయినా ఆదివాసీల సర్వతో ముఖాభివృద్ధిని ప్రతిబింబించేలా ఆశాజనకంగా ఉండాలని తెలిపారు.

పోలీసుల ముమ్మర వాహన తనిఖీలు

వెంకటాపురం(నూగూరు), జూలై 25: మండలంలోని విజయపురికాలనీ సమీపంలో గల కొత్తపల్లి క్రాస్ వద్ద గురువారం స్థానిక సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతిరావుల ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తనిఖీలను ముమ్మరం చేశారు. తనిఖీల్లో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

వెంకటాపురం(నూగూరు), జూలై 25: భద్రాచలం కేంద్రంగా ఆదివాసీ న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీ న్యాయ కళాశాల కోసం అసెంబ్లీలో ఆదివాసీ ఎమ్మెల్యేలు మాట్లాడాలన్నారు. రాష్ట్రాల విభజన వల్ల ఆదివాసీలకు అన్యాయం జరిగిందని, ఆదివాసీ న్యాయకళాశాల ఏర్పాటు కోసం ఆదివాసీ యువత ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

రుణమాఫీ ఫిర్యాదుల స్వీకరణ

వెంకటాపూర్(రామప్ప), జూలై 25: వ్యవసాయ అధికారులు రుణమాఫీ ఫిర్యాదులను రైతుల నుంచి స్వీకరిస్తున్నారు. ఇందులో భాగంగా మండలకేంద్రంలోని రైతువేదికలో గురవారం ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం జరగగా ములుగు సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శ్రీపాల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు ఏవో కళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

చిట్యాల, జూలై 25: ఆదర్శ పాఠశాలల్లో 11 సంవత్సరాలుగా ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని ప్లాకార్డులతో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. గురువారం లంచ్ సమయంలో పాఠశాల ఎదుట బదిలీలు చేపట్టాలని, పదోన్నతులు కల్పించాలని, ఇంక్రిమెంట్లు, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాకేష్, శ్రీకాంత్, రఘుపతి, మంజుల, ఉపేందర్, కుమారస్వామి, రమేష్ తదితరులు ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలలను నిర్లక్ష్యం చేయొద్దు

గణపురం, జూలై 25: మండలంలోని గాంధీనగర్ వద్ద ఉన్న మహాత్మజ్యోతీబా పూలే ఆశ్రమ పాఠశాలను డీఎస్పీ నాయకులు గురువారం సందర్శించారు. భోజనశాల గదులను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పాఠశాలలో క్రీడా ప్రాంగణం, పాఠశాల చుట్టూ ప్రహరీ గోడను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోగిల జితేందర్, ప్రధాన కార్యదర్శి కండె రవి, విక్రమ్ తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత

గణపురం, జూలై 25: వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని బుద్దారం గ్రామంలో వన మహోత్సవంలో కార్యక్రమంలో పాల్గొన్నారు. వంగపల్లివాని చెరువు వద్ద మొక్కలు నాటారు. అనంతరం సెగ్రిగేషన్ షెడ్‌ను సందర్శించి తడిచెత్త పొడిచెత్తలను వేరువేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి హేమంత్, టీఏ శ్రావణ్, సారంగం ఉన్నారు.

సాంస్కృతిక సారథి కళాకారుల ప్రదర్శన

కాటారం, జూలై 25:కాటారం మండల కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు గురువారం కళా ప్రదర్శన చేపట్టారు. జిల్లా కలెక్టర్, డీపీఆర్వో ఆదేశాల మేరకు సారథి కళాకారులు భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాటల ద్వారా అవగాహన కల్పించారు. కుమార్ నేతృత్వంలోని కళాకారుల బృందం చిరుజల్లుల మధ్యనే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, మత్తు పదార్థాల అనర్థాలు, వనమహోత్సవం వంటి అంశాలపై అవగాహన కల్గించారు. పలువురు కళాకారులు పాల్గొన్నారు.

మహదేవపూర్ సీఐగా రామచంద్రరావు



మహదేవపూర్, జూలై 25 : మహదేవపూర్ సర్కిల్ సీఐగా కె.రామచంద్రరావును నియమిస్తూ న మల్టీజోన్ -1 ఐజీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం కమిషనరేట్ పరిధలో సీసీఎస్-3 సీఐగా విధులు నిర్వహిస్తున్న సీఐని మహదేవపూర్‌కు బదిలీ చేశారు. మహదేవపూర్ సర్కిల్‌లో పలు ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు అంశాలు చర్చకు వచ్చాయి. ఈ నేపథ్యంలో గతంలో మహదేవపూర్ సీఐగా పనిచేసిన రాజేశ్వర్‌రావుని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు.


ఘనంగా మడేలయ ఉత్సవాలు

భూపాలపల్లిటౌన్, జూలై 25: రజక కులస్థుల ఆరాధ్య దైవం మడేలయ ఉత్సవాలు భూపాలపల్లి పట్టణంలో రజక కుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి మునిసిపల్ చైర్మన్ సెగ్గం వెంకటరాణి సిద్ధు, మునిసిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి ముఖ్య అతితులుగా హాజరయ్యారు. ఈ సంద్భార్భంగా మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో మడేలయ గుడి వద్దకు వెళ్లి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో శోభన్‌బాబు, మురళి, శ్రీను, సమ్మయ్య, మల్లేష్ రాజమల్లు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు ఘన వీడ్కోలు

తాడ్వాయి, జూలై 25: మండలకేంద్రంలోని ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్‌లో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను విద్యార్థులు పూలమాలలతో సత్కరించి శాలువాలతో సన్మానించారు. గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన వీడ్కోలు సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. మండల విద్యాశాఖ అధికారి యాప సాంబయ్య, మండల నోడల్ ఆఫీసర్ కేశవరావు, ఉపాధ్యాయులు బాబూరావు, నాగేశ్వర్‌రావు, లక్ష్మయ్య, శంకర్, చంద్రారెడ్డి, వెంకటలక్ష్మి, పాపారావు, స్వామి, రేణుక, మంద రవీందర్, వసంతరావు, కృష్ణయ్యతోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా రఘు



డాక్టర్ రఘు

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 25: భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె. రఘు నియమితులైనారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌దేవ్‌డే ములుగు జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో డీఎంఈ డాక్టర్ రఘును తాత్కలిక ప్రిన్సిపాల్‌గా నియమించింది. డాక్టర్ రఘు భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కాలేజీలోనే జనరల్ సర్జరీ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బాధ్యతులు స్వీకరించిన అనంతరం కలెక్టర్ రాహుల్‌శర్మను ప్రిన్సిపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రభుత్వ అవకాశాలు వినియోగించుకోవాలి

గణపురం, జూలై 25: ప్రభుత్వం రైతులకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్, ఉద్యానవణ శాఖ అధికారి సంజీవరావులు అన్నారు. గురువారం మండలంలోని మైలారం గ్రామ పంచాయితీలో రుణమాఫీపై రైతుల సందేహాలను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా 1974మంది రైతులకు లక్షలోపు రుణమాఫీ జరిగిందన్నారు. రుణమాఫీపై రైతులతో ముఖాముఖిగా అడిగి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

ముదిరాజ్‌లను బీసీఏలోకి మార్చాలి

ఏటూరునాగారం, జూలై 25 : ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ జగదీశ్వర్‌కు ముదిరాజ్ మహాసభ ములుగు జిల్లా నాయకులు గురువారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ములుగు నియోజకవర్గ ముదిరాజ్ మహాసభ ఇన్‌చార్జి చిటమట రఘు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకులు, మత్య్య సొసైటి ఉపాధ్యక్షులు చింతకింది రాజు, ముదిరాజ్ మహాసభ మండల నాయకులు, మత్య్య సొసైటి డైరెక్టర్ నకిరబోయిన రమేష్ పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

కాకతీయఖని, జూలై 25: సింగరేణి భూపాలపల్లి ఏరియాలో కురుస్తున్న వర్షం ప్రభావంతో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్- 2,3లలో బొగ్గును వెలికి తీయడం సాధ్యపడలేదు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో క్వారీల్లో వర్షపు నీరు నిలిచింది. దీంతో కోల్ ఆపరేషన్, ఓవర్ బర్డెన్(ఓబి) పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. రహదారులు బురదమయం కావడంతో యంత్రాలు కదలలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఉపరితల గని నుంచి బొగ్గను వెళికి తీయడం కష్టతరం అయింది. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-2లో రోజుకు 2308 టన్నుల బొగ్గను వెలికి తీయాల్సి ఉంది, ఓసీ-3లో 4077టనున్నల బొగ్గు ఉత్పత్తిని సాధిం చాల్సి ఉంది. అయితే గురువారం ఒక్క టన్ను బొగ్గను కూడా వెలికి తీయలేదని ఏరియా సింగరేణి అధికారులు చెబుతున్నారు. దీంతో ఓసీ-2,3ల ద్వార సింగరేణి సంస్థకు సుమారు రూ. 2కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు.

గిరిజన గ్రామాల్లో భయాందోళనలు

తాడ్వాయి, జూలై 25: తాడ్వాయి మండల సరిహద్దులో గల దట్టమైన అటవీప్రాంతంలో గురువారం ఉదయం ఎన్‌కౌంట ర్ జరిగినట్లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మండలంలోని ప్రజలు భయాందోళననకు గురయ్యారు. పూర్తి దట్టమైన అడవిలో గిరిజన గ్రామాలైన బొల్లెపల్లి, అల్లిగూడెం, పోచాపూర్, బందాల, నర్సాపూర్, గుండాల మండలంలోని దామెరతోగు, వెంకటాపురం తదితర గ్రామాలు ఉన్నాయి. ఈప్రాంతంలో స్పెషల్‌పార్టీ పోలీసులకు, మావోయిస్టులకు జరిగిన ఎదురుకా ల్పుల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం గ్రామానికి చెందిన నల్లమారి అశోక్ అలియాస్ విజేందర్ మృతిచెందినట్లు వైరల్ అయింది. ఈ సంఘటనలో కొంతమంది మావోయిస్టులు తప్పించుకున్నారనే అనుమానంతో పోలీసులు తాడ్వాయి అటవీ ప్రాంతంలో జల్లెడపడుతున్నారు.

కౌలు రైతులకు రూ.15వేలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిసాన్‌మోర్చా జిల్లా ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి

ములుగు కలెక్టరేట్, జూలై 25: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని కౌలు రైతులకు ఏడాదికి రూ.15వేలు, కూలీలకు రూ.12వేలు అందిం చాలని కిసాన్‌మోర్చా జిల్లా ఇన్‌చార్జి పెద్ది మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ములుగులోని బీజేపీ కార్యాలయంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు లడే శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో అయన పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాంతో కలిసి పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర గిరిజనమోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, నాయకులు శీలమంతుల రవింద్రచారి, జాడి రామరాజు, జినుకల కృష్ణాకర్, రాయంచు నాగరాజు, హనుమంతరెడ్డి, రవిరెడ్డి, గాధం కుమార్, బండి బాబు, భూక్య శ్రీనివాస్, ఎలుకపల్లి శ్రీనివాస్, తోట సతీష్, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధిపత్య ధోరణిలో సింగరేణి అధికారులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య

కాకతీయఖని, జూలై 25: సింగరేణి కార్మికులపై అధికారులు కొందరు ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తున్నారని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర గట్టయ్య అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని బాతాలరాజ్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా కొందరు అధికారులు కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ, ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారన్నారు. కార్మికులు ఎదర్కొంటున్న సమస్యలను గని స్థాయి అధికారులకు చెప్పుకుంటుంటే వారు స్పందించడంలేదని, ఏమైన సమస్యలుంటే పై అధికారులతో మాట్లాడుకొండని చెబుతున్నారని అన్నారు. సీఎండీ బలరాంనాయక్ సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం అహర్నిషలు పాటుపడుతుంటే జీఎం స్థాయి అధికారులు మాత్రం కార్మికుల సమస్యలు గాలికి వదిలేస్తున్నారని అన్నారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న కొందరు అధికారులపై సింగరేణి డైరెక్టర్లు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమారస్వామి, రాజన్న, జనార్దన్, ప్రసాద్‌రెడ్డి, బాబు, లింగన్న, శీధర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలను పరిష్కరించకుంటే ఓసీపీలో పనులను అడ్డుకుంటాం'

మల్హర్, జూలై 25 : జెన్ కో భూ ఉపరితల బొగ్గు గనుల తవ్వకాల్లో భాగంగా పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్ పరిధిలోని ఇళ్లను, భూములను సేకరించి పరిహారం చెల్లించి, సురక్షిత ప్రాంతానికి తరలించాలని భూ నిర్వాసితులు కోరుతున్నారు. గురువారం మండల కేంద్రమైన తాడిచర్లలో భూ నిర్వాసిత కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఫిబ్రవరిలో తమ సమస్యలన పరిష్కరిచాలని ఓసీపీలో నిర్వాసితులు పనులను అడ్డుకోగా కేటీపీపీ సీఈ సిద్దయ్య నాలుగు నెలల్లో నిర్వాసితుల సమస్యలను పరిష్కారిస్తామని చెప్పి ఆరు నెలలు కావస్తున్నా ఇప్పటికి ఎలాంటి ప్రక్రియ ప్రారంభం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓసీపీలో నిత్యం జరిగే బ్లాస్టింగ్ ఇల్లు బీటలు బారుతున్నాయని, వాతావరణం కాలుష్యం ఏర్పడి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నాఢ్నారు. సెప్టెంబర్ మొదటి వారంలోపు సమస్యలను పరిష్కరించకుంటే నిర్వాసితులందరం కలిసి కేటీపీపీ, కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు అక్కపాక సమ్మయ్య, తాండ్ర మల్లేష్, రావుల ఆంజనేయులు, రాజయ్య, సారంగం, సందీప్, పీరయ్య తదితరులు ఉన్నారు.

మహిళలు ఉపాధిని మెరుగుపర్చుకోవాలి

కాటారం, జూలై 25: నైపుణ్యాభివృద్ధితో మహిళలు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని నాబార్డ్ డీడీఎం రవికుమార్ అన్నారు. మండలకేంద్రంలో నాబార్డ్ సహకారంతో అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూట్ బ్యాగుల తయారీ ఉచిత శిక్షణా కేంద్రాన్ని డీడీఎం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీఎం రవికుమార్ మాట్లాడుతూ నెల రోజుల పాటు ఉచిత శిక్షణ శ్యోడం రుగుతుందన్నారు. శిక్షణలో పాల్గొనే మహిళలకు స్టైఫండ్ చెల్లిస్తామన్నారు. శిక్షణా కాలం అనంతరం సర్టిఫికెట్లు అందజేసి ఆసక్తికల్గిన మహిళలకు నాబార్డ్ ద్వారా బ్యాంక్ రుణం ఇప్పించి సొంతంగా యూనిట్లు ఏర్పాట్లు చేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ మండల ఏపీఎం లవకుమార్, సీసీలు విజిత, స్వర్ణలత, శిక్షణా కేంద్రం కో-ఆర్డినేటర్ సూర్యదేవర వనిత, శిక్షకురాలు అరుణ, శిక్షణ పొందే మహిళలు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

భూపాలపల్లిటౌన్, జూలై 25: వర్షాకాలం ప్రారంభం నుంచి ఉద్యానవన పంటలను వేసుకునే రైతులు సంబంధిత వివరాలను కార్యాలయంలో నమోదు చేసుకోవాలని జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి డి.సంజీవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కూరగాయలు, ఆయిల్‌పామ్, పండ్ల తోటలు, మిర్చి తదితర వాటిపై రైతులు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారని అన్నారు. జిల్లాలో 919.14ఎకరాల్లో పండ్లతోటలు, 145 ఎకరాల్లో కూరగాయల సాగు, 551 ఎకరాల్లో ఆగ్రో ఫారెస్ట్ పంటలు, 41ఎకరాల్లో మల్బరీ, 3ఎకరాల్లో పూలతోటలు, 24533 ఎకరాల్లో సుగంధద్రవ్య పంటలు, 3394 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటలు వేస్తున్నారని తెలిపారు. కాగా ఇంకా ఈసారి కూడా పంటలు వేసే వారు వ్యవసాయ విస్తరణ అధికారులకు తెలిపి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

ఎడతెరిపి లేని వర్షం



పత్తి చేనులో నిలిచిన వాననీరు

కాటారం, జూలై 25:మండలంలో బుధవారం రాత్రి, గురువారం ఎడతెగకుండా కురుస్తున్న వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. వర్షానికి లోతట్లు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆకాశానికి చిల్లులు పడినట్లుగా ఎడతెగకుండా జల్లులు కురియడంతో పత్తి పంటలకు నష్టం వాటిల్లుతున్నదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి చేలల్లో వర్షపు నీరు నిలిచి మొక్కలు నల్లబడి నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే భారీ వర్షాలు కురిసి వరదలతో మునిగిన పత్తిపంటకు ఎడతెగకుండా కురుస్తున్న వర్షంతో నష్టం వాటిల్లుతుందని ఆవేదన చెందుతున్నారు.

జ్వరాల పై అప్రమత్తంగా ఉన్నాం : డీఎంహెచ్‌వో



కృష్ణాపురంలో జ్వరబాధితుడిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వాజేడు, జూలై 25: సీజనల్‌గా వ్యాపించే జ్వరాల పై అప్రమత్తంగాఉన్నామని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టరు అల్లెం అప్పయ్య అన్నారు. గురు వారం మండలంలోని కృష్ణాపురంలో రెండు రోజుల నుంచి పలువురు గ్రామస్థులు జ్వరాలతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో అప్పయ్య కృష్ణాపురంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న అప్పయ్య జ్వరాల తో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామంలో సుమారు 341 కుటుంబాలు ఉండగా పలు ఇళ్లకు వెళ్లిన ఆయన ఇంటి పరిసరాలను పరిశీలించారు. 76 మందికి పరీక్షలు జరపగా నలుగురు జ్వరాలతో బాధ పడుతున్నట్లు గుర్తించి వారికి అవసర మై న మందులు అందజేశారు. డీఎంహెచ్‌వో వెంట పేరూరు వైద్యాధికారి రాహిల్, హెచ్ఏ శ్రీను, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు న్యాయవిజ్ఞాన సదస్సు

ములుగు రూరల్ జూలై 25: ములుగు మండలం అబ్బాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ కూలీలకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ మాట్లాడారు. దుక్కి దున్నిన నాటినుంచి పండించిన పంటను మార్కెట్‌లో అమ్మేవరకు వ్యవసాయానికి సంబంధించిన పలు చట్టాల గురించి, నాణ్యత లేని విత్తనాలు, నకిలీ పురుగు మందుల వల్ల నష్టం వాటిల్లినప్పుడు, మార్కెట్‌లో మోసాలు జరిగినప్పుడు, పంటల భీమా అందనప్పుడు చట్టాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత న్యాయం, హక్కులు, సాగు చట్టాలతో పాటు వివిధ రకాల హక్కులు, న్యాయ సేవలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోతు స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శక్తి వనరులను దుర్వినియోగం చేయొద్దు

గోవిందరావుపేట, జూలై 25: శక్తి వనరులను దుర్వినియోగం చేయకూడదని జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ అన్నారు. మండలంలోని చల్వాయి తెలంగాణ మోడల్‌స్కూల్‌లో గురువారం తెలంగాణ నేషనల్ గ్రీన్‌కార్ప్స్ ములుగు జిల్లా ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి విద్యాసాగర్ అధ్యక్షతన మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్, క్లైమేట్‌చేంజ్, సేవ్ ఫౌండేషన్ సంయుక్తంగా ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీ వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జయదేవ్ పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అధిక విద్యుత్‌శక్తి వినియోగాన్ని తగ్గించడం కోసం తక్కువ విద్యుత్‌శక్తితో ఎక్కువ వెలుతురు ఇచ్చే ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల వాడకం వల్ల విద్యుత్‌శక్తి వినియోగం తగ్గించి పొదుపు చేయవచ్చునని అన్నారు. అనంతరం విద్యార్థులకు ఎన్‌జీసీ సిబ్బంది ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీ, వర్మీ కంపోస్ట్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి కుందూరు సోమారెడ్డి, జిల్లా భౌతికశాస్త్ర ఫోరం అధ్యక్షుడు శిరుప సతీష్‌కుమార్, గణితశాస్త్ర ఫోరం జిల్లా అధ్యక్షుడు ఏళ్ల మధుసూదన్, జీవశాస్త్ర ఫోరం జిల్లా సభ్యుడు షేక్ దేహముద్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ పద్మ, గైడ్ టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం శాసనసభలో 2024-25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సమావేశాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి సీతక్క హాజరయ్యారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



కేజీబీవీలో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

రేగొండ, జూలై 25: విద్యార్థుల భవితవ్యం తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని వారికి నాణ్యమైన విద్యా బోదన అందించాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలో గురువారం ప్రభుత్వ ఉన్నత ఉన్నత పాఠశాల కస్తూర్బా గాంధీ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను, నిర్మాణంలో ఉన్న జూనియర్ కళాశాల భవనాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న పనుల ను త్వరగా పూర్తి చేయాలని అధజకారులను ఆదేశించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించి సీజనల్ వ్యాదులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, వైద్యాధికారి హిమబిందు పాల్గొన్నారు.